సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 26 । ఆగస్టు । 2023



నిరుపయోగంగానే..
రూ.4.20 కోట్లతో నిర్మించిన గురుకుల పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది.
వివరాలు 8లో ▸



ఏసీబీకి పట్టుబడిన ఆర్‌ఐ
భూమి విరాసత్ చేసేందుకు లంచం తీసుకుంటూ ఓ ఆర్‌ఐ ఏసీబీకి పట్టుబడ్డాడు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36.9 /22.5
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

జాడలేని చినుకు..

25 రోజులుగా వర్షం లేక వాడుముఖం పట్టిన పంటలు
- వర్షాధారంపైనే జిల్లాలోని 70 శాతం సాగు
- పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం
- వర్షాభావ పరిస్థితులతో తగ్గిన సాగు విస్తీర్ణం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో సుమారు 25 రోజులకు పైగా చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కళ్లముందే ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. బోరు, నీటి పారకం ఉన్న రైతులు పంటలకు తడి అందిస్తుండగా.. వర్షంపై ఆధారపడి సాగుచేసిన పంటలు ఎండుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పత్తి, వరి, మొక్కజొన్న పంటల సాగు తక్కువగా నమోదైంది. గతేడాది ఈ సమయానికి మూడు ఫీట్ల వరకు ఎదిగిన పత్తిపంట ఈ సారి చినుకు లేకపోవడంతో ఎక్కడ చూసినా మొక్కలన్నీ మోడుబారిపోయి దర్శనమిస్తున్నాయి.

భారీగా తగ్గిన పంటల సాగు..
జిల్లాలో ఈ సారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పత్తి, మొక్కజొన్న, వరి పంటల సాగు గణనీయంగా తగ్గింది. గతేడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా పత్తి పంట 2,84,139 ఎకరాల్లో సాగుకాగా, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2,43,053 ఎకరాల్లో మాత్రమే రైతులు సాగు చేశారు. గతంలో మొత్తం 95,129 ఎకరాల్లో వరిపంట సాగుకాగా, ఈ సారి ఇప్పటి వరకు 86,456 ఎకరాలకు పరిమితమైంది. ఈ సారి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపారు. గతంలో 22,217 ఎకరాల్లో మొక్కజొన్న సాగుకాగా ఈ సారి మొత్తం 40,481 ఎకరాల్లో రైతులు మొక్కజొన్నను సాగుచేశారు. గత సీజన్‌లో మొత్తం 4.50 లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేయగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం సాగు 3,77,718 ఎకరాలకే పరిమితమైంది.



'ఈ ఫొటోలో కన్పిస్తుంది అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లికి చెందిన రైతు నాగేశ్వర్‌కు చెందిన మిరప తోట. తనకున్న రెండెకరాల్లో మిరప పంటను సాగుచేయగా.. 25 రోజులుగా చినుకు కూడా పడలేదు. దీంతో నీరులేక మిరప పంట ఎండిపోయి కన్పిస్తోంది. ఈ సారి దిగుబడి వచ్చే అవకాశమే లేకపోగా.. విత్తనాలు, దున్నేందుకు అయిన ఖర్చులు కూడా నష్టపోయానని రైతు వాపోతున్నాడు.'

వానాకాలంలో జిల్లాలో ఇప్పటి వరకు సాగైన పంటల వివరాలు.. (ఎకరాల్లో)

పత్తి	వరి	మొక్కజొన్న	కంది	జొన్న	ధనియాలు
2,43,053	86,456	40,481	2,841	2,850	918

జనుము	మినుము	సోయా	ఇతర పంటలు	మొత్తం సాగు విస్తీర్ణం
351	194	09	565	3,77,718

పంటపై ఆశలు లేవు..



నాకున్న 3 ఎకరాల్లో పత్తిపంటను సాగుచేశాను. విత్తనాలు, దుక్కి దున్నేందుకు, కూలీల ఖర్చుల కోసం ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చయింది. నెల రోజులుగా వర్షం లేకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. ఈ సారి దిగుబడి ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదు.
– వెంకటాచలం, రైతు, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్ మండలం

ఈసారి సాగు తగ్గింది..



జిల్లాలో ఈ సారి మొత్తం సాగు విస్తీర్ణం 3 లక్షల ఎకరాలకే పరిమితమైంది. తగినంత వర్షం లేకపోవడంతో పత్తి, మొక్కజొన్న, వరి సాగు తక్కువగా నమోదైంది. సుమారు 20 రోజులకు పైగా వర్షం లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. బోరు, నీటి వసతి ఉన్నవారు వారానికి ఓ సారి పంటకు నీరందించి కాపాడుకోవాలి.
– వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఇంకా నిండని శ్రీశైలం రిజర్వాయర్..
గతేడాది ఈ సమయానికి కృష్ణానది ఉప్పొంగి ప్రవహించగా.. ఈ సారి మాత్రం నీరు లేక కృష్ణమ్మ వెలవెలబోయి కనిపిస్తోంది. గతేడాది జూలై 29 నాటికే శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండను తలపించగా... అధికారులు అన్ని గేట్లను ఎత్తి నీటిని కిందకి విడుదల చేశారు. ఈ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో శ్రీశైలం రిజర్వాయర్ సగం కూడా నిండలేదు. రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 215 టీఎంసీలు కాగా.. ఇప్పటి వరకు రిజర్వాయర్‌లో కేవలం 103 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. దీంతో రానున్న రోజుల్లోనూ పూర్తిస్థాయిలో నిండకపోతే పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది.

న్యూస్‌రీల్

8న జాబ్ మేళా
కందనూలు: జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ (ఆర్ట్స్, కామర్స్) కళాశాలలో వచ్చేనెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముత్తూట్ ఫైనాన్స్, టెలీపర్ఫామెన్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, అరబిందో, హెటిరో, టెక్ మహీంద్రా, విప్రో, శ్రీవిజయ బయో ఫర్టిలైజర్ తదితర కంపెనీల్లో ఖాళీల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2018 నుంచి 2023 సంవత్సరం వరకు ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులని, జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో వచ్చే నెల 8న హాజరుకావాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు
కందనూలు: జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో 9వ, 10వ తరగతి విద్యార్థులకు వారధి ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటన తెలియజేశారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను పోటీతత్వాన్ని వెలికి తీసే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో భాగంగా భారతదేశం సాధిస్తున్న మూడు ముఖ్యమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, దేశంలో అవినీతికి కారణాలు, దీని నిర్మూలనకు నీవు ఇచ్చే సూచనలు, ఉపన్యాస పోటీల్లో భాగంగా భారత్ భవిష్యత్‌లో సాధించే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఈనాటికీ వరకట్న సమస్య ఎందుకు ఉంది అనే అంశంపై పోటీలు ఉంటాయని తెలియజేశారు. ఈ నెల 28న నిర్వహించే మండల స్థాయి పోటీలకు పాఠశాలకు ఒకరు చొప్పున పంపించాలని, మండల స్థాయిలో ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో ఈ నెల 30న నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి(9989921105)ని సంప్రదించాలని సూచించారు.

శ్రీశైలం క్షేత్రానికి మంత్రి కొప్పుల ఈశ్వర్
మన్ననూర్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం రాత్రి శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్లారు. మార్గమధ్యలో మన్ననూర్‌లోని అటవీ శాఖ విశ్రాంతి గృహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శాలువా పూలమాలతో సన్మానించి తేనీటి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ కోఆర్డినేటర్ అంతయ్య, నాయకులు బాలస్వామి, పురుషోత్తం, బాల్‌నారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సృజనాత్మకత పెంపునకు ప్రత్యేక పోర్టల్

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో సృజనాత్మకత, వినూత్నమైన ఆలోచన, సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, టీచర్స్ ఇన్నోవేషన్స్ రెపోజిటరీ(టీఐఆర్) పేరిట పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల కుమార్ దీపక్, డీఈఓ గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డితో కలిసి టీచర్స్ ఇన్నోవేషన్స్ రెపోజిటరీ(టీఐఆర్) పోర్టల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ పోర్టల్ తెలుగు, ఇంగ్లీష్ భాషలో సమాచారాన్ని పొందుపరుస్తారని, విద్యావేత్తల సంఘం మధ్య అనుసంధానకర్తగా ఉంటుందని చెప్పారు. ఇందులో నిత్యం ప్రోగ్రాం ఈవెంట్స్ ద్వారా ఉపాధ్యాయులను ఉత్తేజ పర్చనుందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు గుర్తింపుకార్డులతో పాటు పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. ఇందుకు గాను వారు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్న తర్వాత వారి ఆలోచనలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఉపాధ్యాయుల ప్రతిభకు మరింత పదునుపెట్టేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. tstir.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలను నమోదు చేసుకుని, ఈ పోర్టల్‌ను జిల్లాలోని ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని తెలియజేశారు.

కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి పార్టీకి ద్రోహం చేసిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పస్పులలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, వృద్ధులు, దివ్యాంగులకు రూ.4 వేల పింఛన్, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కలుస్తున్న చేతులు..!

'పాలమూరు'పై కాంగ్రెస్ ఫోకస్.. గెలుపే లక్ష్యంగా వ్యూహాల అమలు



- సెగ్మెంట్ల వారీగా పార్టీ నేతల మధ్య విభేదాలపై నజర్
- సయోధ్యకు శ్రీకారం.. రంగంలోకి రేవంత్, భట్టి
- తొలుత జడ్చర్ల నుంచి ఆపరేషన్ షురూ
- ఎర్ర శేఖర్, అనిరుధ్‌రెడ్డితో హైదరాబాద్‌లో మంతనాలు
- కుదిరిన రాజీ ఫార్ములా.. ఏకతాటిపైకి ఇరువురు
- త్వరలో దేవరకద్ర, మక్తల్, కల్వకుర్తి ఆశావహులతో టీపీసీసీ నేతల భేటీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శ్రమిస్తున్న కాంగ్రెస్ ఉమ్మడి పాలమూరు జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇది వరకే రూపొందించుకున్న వ్యూహాలను పక్కాగా అమలు చేసే కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నేతలు, ఆశావహుల మధ్య విభేదాలను పరిష్కరించి.. అందరూ ఏకతాటిపైకి వచ్చేలా సయోధ్యకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం రంగంలోకి దిగిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు జడ్చర్ల సెగ్మెంట్ నుంచి ఆపరేషన్ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న అనిరుధ్ రెడ్డి, ఎర్రశేఖర్‌తో హైదరాబాద్‌లో మంతనాలు కొనసాగగా.. ఇరువురి మధ్య రాజీ కుదిరినట్లు సమాచారం.

రాజీ ఫార్ములాతో ఏకతాటిపైకి..
జడ్చర్ల నేతల మధ్య విభేదాలపై ఎట్టకేలకు దృష్టి సారించిన టీపీసీసీ కొన్ని రోజులుగా కసరత్తు చేపట్టింది. కలసికట్టుగా ముందుకు సాగి.. విభేదాలను పరిష్కరించే దిశగా ముఖ్య నేతలు పలుమార్లు చర్చించి.. సంప్రదింపుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, మల్లురవి ఆధ్వర్యంలో ఎర్రశేఖర్, అనిరుధ్‌రెడ్డి భేటీకి ఏర్పాట్లు చేశారు. ఇద్దరి వాదనలు విన్న అనంతరం ముఖ్య నేతలు రాజీ ఫార్ములాను వారి ముందు పెట్టగా.. ఇరువురు ఏకతాటిపైకి వచ్చినట్లు తెలుస్తోంది.

'పేట'లో శేఖర్.. జడ్చర్లలో అనిరుధ్?
మంతనాలు కొనసాగుతున్న క్రమంలో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని టికెట్‌ను ఆశిస్తున్న ఇద్దరికీ రేవంత్, భట్టి సూటిగా చెప్పినట్లు సమాచారం. ఎర్రశేఖర్‌కు నారాయణపేట, అనిరుధ్ రెడ్డికి జడ్చర్ల టికెట్ ఖరారు చేసే విధంగా రాజీ ఫార్ములాను వారి ముందు పెట్టి సయోధ్య కుదిర్చినట్లు తెలుస్తోంది. దీంతో ఒకే వేదికను పంచుకోలేమంటూ ఇన్నాళ్లు ఉప్పు, నిప్పుగా ఉన్న నేతలు చేతులు కలపడంతో పాటు ఒకే తాటిపై నిలిచి ప్రజల ముందుకు వచ్చేందుకు సిద్ధమని వారి ముందు ప్రకటించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

త్వరలో మిగిలిన నియోజకవర్గాలపై..
జడ్చర్ల పంచాయితీ తేల్చిన నేపథ్యంలో పార్టీలో టికెట్ కోసం బహుముఖ పోటీ ఉన్న దేవరకద్ర, మక్తల్, కల్వకుర్తి, గద్వాల స్థానాలపై టీపీసీసీ ముఖ్య నేతలు దృష్టి సారించారు. త్వరలో ఆయా స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు అందరితో భేటీ కానున్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు సంప్రదింపుల అనంతరం మాట వినని వారిపై కఠినంగా వ్యవహరించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే చేరికల చిచ్చు రగిల్చిన కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌కు సంబంధించి నిర్ణయం ఏఐసీసీ పెద్దల చేతిలో పెట్టినట్లు తెలిసింది.

తొలి నుంచీ ఉప్పు, నిప్పు
జడ్చర్ల అసెంబ్లీ స్థానంపై టీపీసీసీ సెక్రటరీ అనిరుధ్‌రెడ్డి ఎప్పటినుంచో ఆశలు పెట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే పోటీ చేయాలని ఆయన భావించినప్పటికీ.. అధిష్ఠానం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవికే అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఐదేళ్లుగా నియోజకవర్గ బాధ్యతలు మోస్తున్న అనిరుధ్‌రెడ్డి ఈసారి తనకే టికెట్ వస్తుందనే ధీమాతో ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో అన్నీ తానై వ్యవహరిస్తూ పట్టు సాధించేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి నియామకమైన తర్వాత ఎం.చంద్రశేఖర్ అలియాస్ ఎర్రశేఖర్ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో దుమారం చెలరేగింది. ఆయన రాకను అనిరుధ్‌రెడ్డి మొదట నుంచీ వ్యతిరేకించారు. ఎర్రశేఖర్ కూడా జడ్చర్ల టికెట్‌ను ఆశిస్తుండడమే ఇందుకు కారణం. తాను ఆయనతో వేదికను పంచుకోలేనని అనిరుధ్‌రెడ్డి బాహాటంగానే ప్రకటించారు. ఈ క్రమంలో జడ్చర్ల కాంగ్రెస్‌లోను నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయారు. విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. జడ్చర్లకు రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా స్వాగతం పలికే విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రలో సైతం ఎవరికి వారే వ్యవహరించారు. రేవంత్‌కు ఎర్రశేఖర్.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అనిరుధ్ సన్నిహితులనే ముద్ర పడగా.. రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డి అన్నట్లు ప్రచారం సాగింది.

పేరుందో లేదో చూసుకోండి

- పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఓటరు జాబితా ప్రదర్శన
- ఓటరు నమోదుకు సెప్టెంబరు 19 వరకు గడువు
- నేడు, రేపు, సెప్టెంబరు 2, 3 తేదీల్లో అందుబాటులో బీఎల్‌ఓలు

జిల్లాలో మొత్తం ఓటర్లు	8,78,054
పురుషులు	4,39,832
మహిళలు	4,38,206
ఇతరులు	16
మొత్తం పోలింగ్ కేంద్రాలు	1,054

అచ్చంపేట: ఎన్నికల సంఘం ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 21న ప్రకటించిన విషయం విదితమే. ఓటరు జాబితాలను నియోజకవర్గాల వారీగా కలెక్టర్ నుంచి సరఫరా చేయగా.. అక్కడి నుంచి మండలాలకు అందజేశారు. బుధవారం ఓటరు జాబితా ఆయా గ్రామాలు, మున్సిపాలిటీలకు చేరగా.. సదురు జాబితాను గురువారం ప్రదర్శించారు. ఓటరు జాబితాలో పేరుందో లేదో చూసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. ఒకవేళ జాబితాలో పేరు లేకుంటే ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాలు లేదా ఆన్‌లైన్ లేదా తహసీల్దార్ కార్యాయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సెప్టెంబరు 19 వరకు గడువు
ఓటరు నమోదుకు సెప్టెంబరు 19 వరకు గడువుగా నిర్దేశించింది. కొత్తగా ఓటరు నమోదు చేసుకునేవారు, జాబితాలో పేరు లేనివారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎన్నికల సంఘం ఓటరు నమోదు ఫారాల్లో స్వల్ప మార్పులు చేపట్టింది. ఫారం–6 ఓటరు నమోదు కోసం కాగా ఫారం–8 చిరునామా మార్పు, ఓటర్ల జాబితాలోని వివరాల సవరణకు, వైకల్యం ఉన్న వ్యక్తుల గుర్తింపు, ఓటరు కార్డు భర్తీకి దోహదపడనుంది. ఫారం–6ఏ విదేశాల్లో నివాసముంటున్న భారతీయులు ఓటు నమోదు చేసుకోవడం కోసం కాగా ఫారం–7 ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, పేరు తొలగింపునకు చేసుకోవచ్చు.

ఓటరు నమోదు మీ ముంగింటకే
ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరుగా నమోదు చేసుకునే వెసలుబాటు కల్పించగా.. బూత్‌లెవల్ అధికారులను అందుబాటులో ఉంచనుంది. అక్కడికక్కడే ఓటరుగా నమోదు చేయనున్నారు. ఈ నెల 26, 27 తేదీలతో పాటు సెప్టెంబరు 2, 3 తేదీల్లో జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. 2023 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు రెండు ఫొటోలు, వయస్సు ధ్రువీకరణ కోసం ఎస్సెస్సీ మెమో, చదువులేని వారికి ఆధార్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం లేదా కరెంటు బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది.

నవోదయ దరఖాస్తులకు గడువు పెంపు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తుల గడువు మరోమారు పెంచామని విద్యాలయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అంతేకాక దరఖాస్తులో తప్పుల సవరణకు గడువు తేదీ ముగిసిన అనంతరం రెండు రోజులు ఆన్‌లైన్ కరెక్షన్ విండో అందుబాటులో ఉంటుందని వివరించారు.



మా ఇంటి దేవతా మహాలక్ష్మీ

అచ్చంపేటలో పూజలు చేస్తున్న మహిళలు

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలను మహిళలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన వంటి పూజలు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ, భ్రమరాంబ దేవాలయం, సరస్వతీ శిశుమందిర్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు: డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, బీజేపీ శ్రేణులకు మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. చివరికి బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి రెండు వాహనాల్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి మాట్లాడారు. రాష్ట్రంలో లిక్కర్ ద్వారా వస్తున్న ఆదాయంతోనే ప్రభుత్వం నడుపుతున్నారని చెప్పారు. తెలంగాణలో సామాజిక న్యాయం కొరవడిందని, ప్రజాసామ్యం ఖూనీ అయ్యిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో హామీలు అమలు చేయకుండా, కొత్త హామీలతో మళ్లీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలన అవినీతి, అక్రమాలతో నిండిపోయిందని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అందరూ బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని వారికి కొత్త ఇల్లు ఎప్పుడిస్తారని, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య, రైతు రుణమాఫీ అమలు ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చందు, శ్రీశైలం, బొట్టు శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేమ విఫలమై.. యువతి బలవన్మరణం


షెహనాజ్ (ఫైల్)

మల్దకల్: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన ఓ యువతి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని విఠలాపురంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఊస్సేన్‌సాబ్, ఖాజాబీకి ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె షెహనాబీ (19) హైదరాబాద్‌లో డిగ్రీ రెండో సంవత్సరం చదివేది. ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామానికి చెందిన ఖాజా సమీప బంధువు కావడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లికి యువకుడు నిరాకరించడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గద్వాలకు అటు నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. తండ్రి ఊస్సేన్‌సాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

రైలులోంచి పడి మహిళ మృతి


భారతి (ఫైల్)

మదనాపురం: కదులుతున్న రైలులోంచి మహిళ జారి పడి మృతిచెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున మదనాపురం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ రామకృష్ణ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన భారతి(43) గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి గుర్తుతెలియని రైలు ఎక్కి వెళ్తూ.. ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెందింది. గతేడాది భర్త మృతిచెందాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలియజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని జూరాల కాల్వలో ప్రమాదావశాత్తు పడి పోయిన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన నవీన్(22) పెబ్బేరులో ఓ శుభకార్యానికి వెళ్లి బుధవారం అర్ధరాత్రి కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. జూరాల ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో రెండు రోజుల పాటు కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. పోలీసులు జూరాల అధికారులకు ఈ సంఘటనపై వివరించడంతో కాల్వకు నీరు రాకుండా గేట్లు మూసివేశారు. శుక్రవారం డి-19 డిస్ట్రిబ్యూటర్ కాల్వ వద్ద ముళ్లచెట్లకు తట్టుకున్ని ఉన్నట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లి వద్ద మద్దిమడుగు ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. కుమ్మరోనిపల్లికి చెందిన పంచలింగాల పద్మమ్మ (43) శుక్రవారం ఉదయం పని నిమిత్తం అమ్రాబాద్‌కు వెళ్లింది. సాయంత్రం జీపులో తిరిగి గ్రామానికి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను చూసి జీపు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో మధ్య సీటులో చివరన కూర్చున్న పద్మమ్మ ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోగా టిప్పర్ ఆమె పైనుంచి వెళ్లింది. స్థానికులు వెంటనే 108 వాహనంలో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పద్మమ్మకు భర్త మల్లయ్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురుగుమందు తాగి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పదర ఎస్ఐ తిరుపతిరెడ్డి కథనం మేరకు.. ఉప్పునుంతల మండలం తాడూరుకు చెందిన ఒగ్గు గంగయ్య(72) మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని చింతల మట్టు ప్రాంతం ఎదురుగా పొదల్లో చనిపోయి కనిపించాడు. శుక్రవారం అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు కుళ్లిన వృద్ధుడి మృతదేహం, పురుగుమందు డబ్బా కనిపించింది. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. గంగయ్యకు భార్య లక్ష్మమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. కుమారుడు పదేళ్ల కిందటే మృతిచెందాడు. ఈ నెల 16న డిండి వెళ్లొస్తానని భార్యతో చెప్పి వెళ్లిన గంగయ్య శవమై కనిపించాడు. ఘటనపై కేసునమోదు చేసుకొని అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు. కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహానికి అక్కడే దహన సంస్కారాలు నిర్వహించారు.

ప్రారంభమైనా.. నిరుపయోగంగానే..


నిర్మాణం పూర్తయిన గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

కోడ్గల్‌లో రూ.4.20 కోట్లతో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణం
- నేటికీ ధర్మాపూర్‌లో అద్దె భవనంలో నిర్వహణ
- డైనింగ్ హాల్ పూర్తికాకపోవటంతో తరలింపునకు బ్రేక్

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.4.20 కోట్లతో నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల భవనాన్ని మే 31న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి ప్రారంభించారు. విద్యాసంవత్సరం ఆరంభం జూన్‌లోనే గురుకుల పాఠశాలను


పిల్లర్లకే పరిమితమైన డైనింగ్ హాల్

ధర్మాపూర్ నుంచి తరలిస్తారని అందరూ భావించారు. అయితే డైనింగ్‌హాల్, ప్రహరీ నిర్మాణం పూర్తిగాకపోవటం, నీటివసతి కల్పించకపోవడంతో తరలింపు వాయిదా పడింది.

ప్రమాదకరంగా సంప్ గుంత..
తాగునీటి సంప్ నిర్మాణానికి తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. అందులో వర్షపు నీరు నిల్వడంతో పాఠశాల విద్యార్థులు, చిన్నారులు ఆడుకునేందుకు అటుగా వెళ్లి అందులే పడే ప్రమాదం నెలకొంది. దోమలు వృద్ధిచెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి.

అసంపూర్తి పనులతోనే..

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనం ప్రారంభమైనప్పటికీ డైనింగ్ హాల్, ప్రహరీ నిర్మాణం పూర్తిగాకపోవడం, నీటివసతి కల్పించకపోవడంతోనే నేటికీ ధర్మాపూర్‌లోనే కొనసాగుతుంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వంతోనే డైనింగ్‌హాల్ నిర్మాణం నత్తనడకన కొనసాగుతుంది. బాలికల గురుకుల పాఠశాల కావటంతో ప్రహరీ నిర్మిస్తేనే భద్రత ఉంటుంది. అదేవిధంగా తాగునీటి కోసం నిర్మిస్తున్న సంప్ గుంతలకే పరిమితమైంది. అన్ని పనులు పూర్తిచేస్తేనే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు మరో మూడు నెలల సమయం పడుతుందని అంచనా. భవనం వద్ద వాచ్‌మెన్ లేకపోవడంతో మద్యం ప్రియులకు అడ్డాగా మారే అవకాశాలు లేకపోలేదు. తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లే ఆస్కారం ఉంది.

త్వరలోనే తరలింపు..



ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి కృషితోనే గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తయింది. డైనింగ్‌హాల్, ప్రహరీ, నీటిసంప్ నిర్మాణం పూర్తికాకపోవటంతో ధర్మాపూర్ నుంచి తరలింపులో జాప్యం జరుగుతుంది. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయించి తరలింపునకు చర్యలు తీసుకుంటాం. ఇదే భవనం వద్ద రూ.5 కోట్లతో పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. – కోడ్గల్ యాదయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్

ఇదీ కథ..

రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల పెంపులో భాగంగా నియోజకవర్గానికి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మంజూరైంది. సరైన భవనం లభించకపోవడంతో తాత్కాలికంగా మహబూబ్‌నగర్ సమీపంలోని ధర్మాపూర్ వద్ద అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో 2021లో గిరిజన సంక్షేమశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి రూ.4.20 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణానికి అనువైన స్థలాలు లభించకపోవటంతో మండలంలోని కోడ్గల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మాణానికి పూనుకున్నారు. అదే ఏడాది జూన్ 20న ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లలోనే పూర్తి చేశారు. ఈ ఏడాది మే 31న ప్రారంభించారు.

మార్కెట్‌లోకి గ్లామర్ 125సీసీ విడుదల

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని అశ్విని హీరో షోరూంలో పాత హంగులతో కొత్త హీరో గ్లామర్ 125 సీసీని శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా అశ్విని షోరూం ఎండీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నూతన మోడల్ గ్లామర్ 125సీసీతోపాటు బీఎస్6 ప్రోగ్రామ్డ్ ఫ్యూయల్ ఇంజెక్షన్ ఇంజిన్, ఈ20 ఇంజిన్ కలిగి ఉందన్నారు. పూర్తి డిజిటల్ మీటర్‌తోపాటు ఫ్యూయల్ ఇండికేటర్, మొబైల్ చార్జింగ్ వసతి, ఐ3ఎస్ టెక్నాలజీ, పొడవైన సీటు ఉంటుందన్నారు. ఈ వాహనం 170 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్‌తోపాటు ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉందన్నారు. మార్కెట్‌లో మూడు రంగుల్లో లభ్యమవుతుందని, దీని ఎక్స్‌షోరూం ధర రూ.81,200 అన్నారు.



నూతన బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ప్రతినిధులు

కార్యక్రమంలో మేనేజర్ అజీముద్దీన్, బాలరాజు, రమేష్, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ పట్టివేత


కొండ చిలువను పట్టుకున్న హరీందర్‌రావు

గండేడ్: మండల పరిధిలోని లింగాయిపల్లిలో కొండ చిలువ చిక్కింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. లింగాయిపల్లికి చెందిన దిడ్డి బసప్ప బోరు మోటారు కాలిపోయింది. దీంతో మోటారు తీసేందుకు వెళ్లారు. బోరు చుట్టూ ఉన్న గడ్డి పొదలు తొలగిస్తుండగా.. కొండ చిలువ కంట పడింది. దీంతో అటవీ సెక్షన్ ఆఫీసర్ నర్సింహులుకు సమాచారం అందించారు. ఆయన మరికల్ నుంచి ఫారెస్టు వాచర్లను పంపించారు. అక్కడికి చేరుకున్న వారు దాన్ని పట్టుకోడానికి ప్రయత్నించగా.. ఫలితం లేకపోయింది. అదే సమయంలో సమాచారం అందుకున్న జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు హరీందర్‌రావు అక్కడికి చేరుకుని కొండ చిలువ మూతి తోక పట్టుకుని సంచిలో వేశాడు. పట్టుకున్న కొండ చిలువను పిల్లలమర్రికి తరలించారు.

బెదిరింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య

ఆత్మకూర్: ప్రేమించిన అమ్మాయి తరఫు వారు బెదిరింపులకు పాల్పడటంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని మోట్లంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయగుడిసె పెంటన్నకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మహేష్(19) పదో తరగతి వరకు చదివి డ్రైవింగ్ చేస్తూ.. కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో కొత్తకోట మండలం మీరాస్‌పల్లికి చెందిన యువతితో ప్రేమలో పడ్డాడు. గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో అమ్మాయి తరఫు వారు మహేష్‌కు ఫోన్ చేసి నీవల్ల తన కుమార్తె చనిపోయిందని, నిన్ను, నీ తల్లిదండ్రులను చంపుతామని బెదిరించారు. తన తండ్రి పెంటన్నకు జరిగిందంత విషయం తెలియజేశాడు. ఏమికాదు.. ఉదయం మాట్లాడుకుందామని మహేష్‌కు ధైర్యం చెప్పి భోజనం చేసి పడుకోబెట్టారు. తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ మధ్య రాత్రి ఇంట్లోని దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసేసరికి యువకుడు మృతిచెందాడు. కుమారుడి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

రెండిళ్లలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్‌లోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డులో రెండిళ్లలో చోరీ జరుగగా.. శుక్రవారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొల్లాపూర్ క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని రూ.25 వేల నగదుతో పాట రెండున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అదేవిధంగా పక్కనే ఉన్న కొత్త తిరుపతమ్మ ఇంట్లో రూ.10 వేల నగదు, అరతులం బంగారు రింగు చోరీ చేశారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేందర్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవాబుపేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. చౌడూర్‌కు చెందిన నిక్క మల్లేష్(27) మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా తిరిగేవాడు. దీంతో అతని సోదరుడు కృష్ణయ్య మందలించాడు. మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందుతాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గుర్తించి అతన్ని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయంలో మృతుడి అన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

ఏసీబీకి పట్టుబడిన ఆర్ఐ


దాడుల్లో పట్టుబడ్డ నగదు

భూమిని విరాసత్ చేసేందుకు రూ.10వేలు డిమాండ్

ఆత్మకూర్: భూమిని విరాసత్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఆర్ఐని ఏసీబీ పట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మోట్లంపల్లికి చెందిన గట్టన్న కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు సంబంధించిన 2.26 ఎకరాల భూమిని వారసులైన నాగప్ప, మాబమ్మ, ఆంజనేయులు విరాసత్‌కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను సంప్రదించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు గ్రామంలో పంచనామా నిర్వహించి రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడన్నారు. బాధితులు పట్టణంలోని తమ బంధువు జానకిరాములును కలిసి విషయం చెప్పడంతో ఆర్ఐతో మాట్లాడి రూ.5వేలకు బేరం కుదుర్చుకున్నారు.


ఆర్ఐ నర్సింహులు

అనంతరం మహబూబ్‌నగర్‌లో ఏసీబీకి ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1గంట సమయంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నర్సింహులును కలిసి రూ.5వేలు లంచం ఇచ్చిన వెంటనే పట్టుకుని నగదును స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించామని వివరించారు. పట్టుబడిన ఆర్ఐను స్పెషల్ కోర్టు ఏసీబీ నాంపల్లిలో హాజరుపరుస్తామని, ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిన దుస్తులు, ధాన్యం చూపుతున్న వెంకటమ్మ

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోయ వెంకటమ్మ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న సామగ్రి, నిత్యవసర సరుకులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని పరిశీలించారు.

పేకాటస్థావరంపై దాడి

రూ.60వేల నగదు, బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగుడెం శివారులో శుక్రవారం పేకాట స్థావరంపై స్పెషల్‌టీం, రూరల్ పోలీసులు దాడి చేసి 5 బైకులు, 3 సెల్‌ఫోన్లు, రూ.60,300 నగదుతో పాటు ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. పేకాట ఆడుతున్న మహేష్, ఏర్పుల శ్రీను, యాదయ్య, రమేష్‌గౌడ్, రాములు, సురేష్, రఘురెడ్డి, జగదీష్, రాజవర్ధన్‌గౌడ్, ఈశ్వర్, నర్సింహారెడ్డి, బాషా, శేఖర్‌రెడ్డి, బాబు, మునీశ్వర్‌నాయుడు, చిన్నా, వడ్డె మహేష్, హసన్, అజయ్, రాజేష్‌గౌడ్, నాగిరెడ్డి, చెన్నయ్య 22 మంది పేకాట ఆడుతుండగా ఆరుగురిని పట్టుకున్నారు. మిగతా 16 మంది పారిపోయారు. పేకాట ఆడుతున్న అందరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు/ దేవరకద్ర/ రామన్‌పాడు/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 111 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 738, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 4,494 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.010 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 856.2 అడుగులు
శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 856.2 అడుగుల వద్ద 95.1368 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 7,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,898, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.208 మి.యూ., ఉత్పత్తి చేసి 7,000 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదిలారు. శ్రీశైలం జలాశయంలో 320 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

నిండుకుండలా రామన్‌పాడు..
మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. దీంతో వ్యవసాయ అవసరాల కోసం జలాశయంలోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 500 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 65, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్ 27.6..
కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రం వరకు 27.6 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల నుంచి 315 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో.. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టుకు వచ్చే నీటితో సమానంగా కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో నీటిమట్టం రెండు రోజులకు ఒక ఇంచు పెరుగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో 5 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లు తెరిచే అవకాశం ఉంది.

చెరువులో మునిగి యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చెరువులో మునిగి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని శ్రీపురంలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్ఐ మహేందర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లస్వామి (30) రెండేళ్లుగా భార్యకు దూరంగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి భాగ్యమ్మ వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం ఊరచెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యూట్యూబ్ సెన్సేషన్‌గా.. పెద్దజట్రం కళాకారిణి

- కెమెరా పట్టిన్నడే సీమ దదర సిన్నోడు' పాటతో స్టార్‌గా మారిన ఉష
- యూట్యూబ్‌లో 25 మిలియన్ల వ్యూస్‌తో ప్రాచుర్యం


స్టూడియోలో పాటలు పాడుతున్న మాడపోళ్ల ఉష

ఊట్కూర్: పొట్ట చేతపట్టుకొని పట్నం వెళ్లిన ఓ ఒంటరి మహిళ జీవితాన్ని ఒక్కపాట సెన్సేషన్‌గా మార్చేసింది. చిన్నప్పటి నుంచి జానపద పాటలంటే ఉన్న విపరీతమై ఇష్టమే అదృష్టం వెతుక్కుంటూ వచ్చేలా చేసింది. 'కెమెరా పట్టిన్నడే సీమ దదర సిన్నోడు' అనే పాటతో రాత్రికి రాత్రి స్టార్ సింగర్‌గా మారింది. పాట రాసి, స్వరం కలిపి ప్రాణం పోసి అచ్చం తెలంగాణ యాస, భాషతో పల్లె జానపదాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన ఆ కళాకారిణి నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం గ్రామానికి చెందిన మాడపోళ్ల ఉష. ఈమె ఈ ఏడాది జూన్ 29న పాట పాడగా ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 25 మిలియన్ల వ్యూస్ అంటే 2.50 కోట్ల మంది చూశారంటే పాట క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.

పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు..
తాను వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో ఆడవాళ్లు పాడుకునే జానపద పాటలను శ్రద్ధగా గమనించి పాడుతూ ఉండేది. గత పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ తీరిక సమయంలో జానపద పాటలు పాడుతూ ఉండేది. యూట్యూబ్‌లో జానపద పాటలకు ఆదరణ పెరగడం చూసి తాను సైతం పాటలు పాడాలనే కోరికతో కొన్ని పాటలు రాసి వీడియోలు చేసింది. సరైన ఆదరణ రాకపోయినా.. పట్టువిడవకుండా పాటలు రాస్తూ.. ట్యూన్లు కలుపుతూ అవకాశాల కోసం ఎదురుచూసింది. గతంలో జగిత్యాల జోగుల వెంకటేశ్‌తో రెండు పాటలు, గొల్లపల్లి శివన్న సిరిసిల్లతో ఒక పాట పాడింది. ఓ రోజు జానపద పాటల కవర్‌పై హరీశ్ పాటిల్ ఫోన్ నంబర్ తీసుకొని ఫోన్ చేసి.. తాను జానపద పాటలు రాసి, పాడతానని అవకాశం ఇవ్వాలని కోరింది. ఆయన దగ్గరకు వెళ్లి మూడు పాటలు పాడి వినిపించింది. ఈ క్రమంలోనే కెమెరా పట్టిన్నడే సీమ దదర సిన్నోడు అనే పాట నచ్చడంతో గజ్వేల్‌లో అమూల్య స్టూడియోలో ఆమె దగ్గర పాడించి జూన్ 29న రిలీజ్ చేశారు. యూట్యూబ్‌లో వస్తున్న సెన్సేషన్ చూసి ఉష రాత్రికి రాత్రి జానపద స్టార్ సింగర్‌గా మారిపోయింది. చిన్నపిల్లలతో మొదలుకొని పెద్దల వరకు యూట్యూబ్‌లో పాట వింటూ మురిసిపోతున్నారు.

ఇదీ కుటుంబ నేపథ్యం..

గ్రామానికి చెందిన మాడపోళ్ల ఆశప్ప, మాణిక్యమ్మ దంపతులకు ఉష, మంజుల ఇద్దరు కూతుళ్లు. ఉష గ్రామంలోని పాఠశాలలో 3వ తరగతి వరకు చదివి మానేసింది. చిన్నప్పటి నుంచే పొలం పనులకు వెళ్లేది. అయితే వీరి తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బంధువులు చేరదీసి వరుసకు మామ అయిన వ్యక్తితో పెళ్లి చేశారు. బాబు, పాప పుట్టి అనారోగ్యంతో నెలలు నిండకుండానే మృతిచెందారు. భర్తకు సైతం మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో గ్రామంలో జీవనోపాధి కష్టంగా మారడంతో హైదరాబాద్‌కు వలస వెళ్లింది. అక్కడే భవన నిర్మాణ రంగంలో కూలీ పనులు చేస్తూ ఒంటరి మహిళగా జీవనం సాగిస్తుంది.

చేయూత ఇవ్వండి..



గ్రామంలో రేకుల షెడ్డు ఇల్లు మాత్రమే ఉంది. ప్రభుత్వం నా పరిస్థితిని గుర్తించి గృహలక్ష్మి ఇల్లుతోపాటు జీవనోపాధి కోసం దళితబంధు పథకాన్ని మంజూరు చేయాలి. నాకు జానపద పాటలంటే ఎంతో ఇష్టం. భవిష్యత్‌లో అవకాశం వస్తే సినిమా పాటలు పాడతా. పదేళ్లుగా కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నా. కళాభిమానులు నా జానపద పాటలను ఆదరించి చేయూతనివ్వండి. – ఉష, జానపద కళాకారిణి, పెద్దజట్రం

